

# భవానీద్వీపం

## –వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 24 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

'భవానీద్వీపం పిలుస్తోంది కృష్ణోబా!' అన్న మాటలు చెవులబడి చివ్వున తలెత్తి చూశాడు కృష్ణరాయలు. ఆయన కనులలో ఆశ్చర్యం మెరుస్తున్నది.

అర్చన అనంతరం తీర్థ ప్రసాదములు స్వీకరించి కొంతసేపు మౌనంగా ధ్యానం చేసుకుని కనులు తెరిచాడు సమర్థరాముడు. అర్చకస్వామికి వీడ్కోలు పలికి వెనుదిరిగి మెట్లవద్దకు నిదానంగా నడుస్తున్నారు వారు.

యిప్పుడు కొద్దిగా ఎండ ఎక్కింది. వీస్తున్న గాలులలో అంత చల్లదనం లేదు. కొద్దిగా పొడిబారింది గాలి. ధ్వజస్తంభానికున్న చిరు గంటలు సన్నని ధ్వనులు చేస్తున్నాయి. కొండమీద, చెట్లమీద పక్షుల కూతలు చిత్రంగా ప్రతిధ్వనిస్తున్నాయి. రెండుమాసాల తర్వాత రాబోయే వసంతవేదికకు ఇప్పటినుండే సాధన చేస్తున్నది కోయిల ఒకటి. గుబురైన కొమ్మలలో దాక్కుని మధురంగా కూస్తున్నది. ప్రతిధ్వనిస్తున్న తనకూతకు జవాబుగా పోటీగా మరలా తను కూస్తున్నది! కోకిలల బృందగానంలా వున్నది వినేవారికి. ధ్వజస్తంభానికున్న మువ్వల నాదం జోడువాయిద్యంలా ఉన్నది. ఆ గాన ధ్వని ప్రతిధ్వనులు సమర్థరాముడి చెవులకు సోకాయి.

'చూశావా! కృష్ణోబా! ఒకటే సత్యం, మరొకటి దాని అనుకరణ! ఒకటి బింబం, మరొకటి ప్రతిబింబం! రెండు పిట్టలు, ఒకటి పరమాత్మ, మరొకటి జీవాత్మ!' అంటూ ఉన్నట్టుండి నిల్చుండిపోయాడు సమర్థుడు. ఆనంద పారవశ్యంతో ఆయన ముఖం వెలిగిపోతున్నది. ఆయన శరీరంమీద పులకలు రేగుతున్నాయి. సగమే తెరుచుకున్న కనులు కూడా ఏదో దివ్యలోకాన్ని చూస్తున్నట్లు అర్ధనిమీలితాలు అయినాయి. ఇంచుమించు సమాధి స్థితి అది. ముసి ముసి నవ్వులు కురిపిస్తూ ఉన్నట్టుండి అందుకున్నాడు మధురంగా.

'అనగనగా ఒక ఊరు వూరిలోన ఊర చెరువు
గట్టు మీద రావి చెట్టు చెరిసగమై వేపచెట్టు
చెట్టు కొమ్మ మీద పిట్ట పక్కన ఇంకొక్క పిట్ట
గుబురాకుల కొమ్మన ఉండే కబురులాడు పిట్టలు రెండు
అంటుంది వింటుంది కంటుంది ఒక పిట్ట
అనకుండా వినకుండా కనకుండా ఇంకొక పిట్ట
పిట్ట ఒకటి ఏడుస్తుంది ఒక పరి సంతోషిస్తుంది
మరొకటేమొ మౌనంగా ఆటగ గొని గమనిస్తుంది
అనుభవించు నొకపిట్ట ఆడించేదొక పిట్ట
అయినా గమనింపుడయ్యా ఆ రెండూ ఒకటేనయ్యా
పిట్ట ఒకటి బింబమౌను ఒకటౌ ప్రతి బింబము!'

లయబద్ధంగా చిందులేస్తున్న ఆయన పాదాలు ఆగిపోయాయి. ఆయన పాట ఆగిపోయింది.అవ్యక్తమధురమైన ఆనందం కలిగింది రాయలకు. ఎప్పుడొచ్చాడో ఏమో, అర్చకస్వామి సమీపంలో వుండి వింటున్నాడు ఆ తత్త్వగీతాన్ని. కనులు తెరిచాడు సమర్థరాముడు.'భవానీ ద్వీపానికి పిట్ట ఎగిరిచేరే సమయమయ్యింది కృష్ణోబా!' అంటూ ముందుకు అడుగులేశాడు.

యిప్పటికిప్పుడా స్వామీ? సంశయంగా ప్రశ్నిస్తూ అనుసరించాడు కృష్ణరాయలు.

దాదాపు వేయి ఎకరాల విస్తీర్ణంలో కృష్ణానదీగర్భంలో ఉన్న ద్వీపం భవానీ ద్వీపం. చిత్తడి నేలల, చిట్టడవులమయం. భయంకరమైన విషసర్పాలకు, క్రూరమృగాలకు నిలయం. దుర్మార్గులైన ఆటవికులకు ఆటపట్టు. అటు మంగళగిరికి, యిటు ఇంద్రకీలాద్రికి మధ్యనున్న కృష్ణాద్వీపం. పానకాలస్వామికి, కనకదుర్గమ్మకు మధ్యలో వెలసిన మాయామయమైన ద్వీపం!

నిరంతరమూ కృష్ణమ్మ అలలమధ్యన వూయలలూగుతూ ఉత్సుకతను, ఉద్విగ్నతను రేకెత్తించే రహస్యాల మయం భవానీద్వీపం అని ఎందఱో అంటుంటే విని ఉన్నాడు రాయలు!

ఎందఱో తాంత్రికుల ఉగ్రసాధనలకు మౌనసాక్షి భవానీద్వీపం అని చెప్తుంటే విన్నాడు.

శరన్నవరాత్రులలో దుర్గమ్మ పతిదేవుడితో విహరిస్తుందట ఆ ద్వీపంలో! అందునా పైయెత్తున కురిసిన వర్షాలకు పొంగి పొరలుతున్నదట కృష్ణమ్మ. ఏర్పాట్లకు ఒకరోజన్నా సమయం కావాలే అనుకున్నాడు తన మనసులో.

'రేపు మకరసంక్రమణం! కృష్ణమ్మ తీర్థసేవ, భవానీక్షేత్ర సందర్శనం, భవానీ ద్వీప దర్శనం!'మూడు ముక్కలలో ముద్దుగా ఆదేశించాడు సమర్థరాముడు.

'కృష్ణాప్రవాహం మాత్రమే కాదు, కాలప్రవాహమూ కనిపించనున్నది కృష్ణోబా! జరిగినదీ,

జరుగుతున్నదీ, జరుగబోయేదీ అంతా చమత్కార దర్శనం యివ్వబోతున్నది! ఇంతకుముందు జరుగని విచిత్రం జరుగబోతున్నది కృష్ణోబా!' అన్నాడు. సంశయం స్థానంలో సంభ్రమం చోటుచేసుకుంది కృష్ణరాయల మనసులో.

ఈపాటికి మెట్లమీదుగా కొండను దిగి సగందూరం వచ్చారు వారు. కొండ పాదాలవద్ద మెట్లమీదుగా కోలాహలం వినిపించింది. పెద్ద పెద్ద వలలు, ఆయుధాలు ధరించిన సిపాయీలు పరుగునా మెట్లు ఎక్కుతున్నారు. స్తంభాద్రి ఖిల్లా రక్షకభటులు వారిని అనుసరిస్తున్నారు. వారి వెనుక పెద్ద పెద్ద నాగస్వరాలు ధరించిన పాములవాళ్ళు!

ఆలయంలో మహాసర్పం బయటకు వచ్చినవెంటనే పారిపోయిన సిపాయీలు అందరికన్నా ముందుగా పరుగునా మెట్లు ఎక్కివస్తున్నారు. తాము చూసిన మహాసర్పంగురించి కొత్వాలుకు వివరించి చెప్పినట్లున్నారు. కొత్వాలు ఆదేశంతో సమర్థరాముడికి, కృష్ణరాయలకు రక్షగా మందీ మార్బలంతో వస్తున్నారు! ఆ కోలాహలాన్ని చూపిస్తూ చిలిపిగా నవ్వాడు సమర్థరాముడు!

'పిచ్చి పిల్లలు కృష్ణోబా! వారికి తెలియదు! ఆమె నాగమాత! పెద్ద పామును కొట్టడం మాత్రమే అనుకుంటున్నారు' అంటూ ఆగిపోయాడు. చేతులుసాచి కృష్ణరాయలనుండి తన అమ్ములపొదిని అందుకున్నాడు. మూపుకు బిగించుకున్నాడు. విల్లు యథాప్రకారం ఆయన వామహస్తాన్ని అలంకరించింది.

తమను చూసి మూడు మెట్ల క్రిందుగా ఆగిపోయిన సమూహాన్ని చూపిస్తూ కృష్ణరాయలకు సంజ్ఞ చేశాడు. వారివద్దకు వెళ్లి సమాధానపరిచి వెనుకకు మరల్చాడు కృష్ణరాయలు. ఆఖరి మెట్టు దిగుతుండగా కనిపించారు ఉద్ధవుడు, కళ్యాణ్ స్వామి. వారి ప్రక్కన కృష్ణరాయలపల్లకీ బోయీలు కనిపించారు. ఆ వెనుకగా సిద్ధంగా ఉన్నది పల్లకీ.

'నీ కోరికమేరకు ముక్తివరంవరకూ దీనికి పల్లకీసేవ' అన్నాడు సమర్థుడు చిలిపిగా తనను

చూపించుకుంటూ. ఆయన అధిరోహించిన పల్లకీ కదిలింది. దానికి ముందుగా కృష్ణరాయల గుర్రం దారి చూపింది. అటూ యిటూ ఉద్ధవుడు, కళ్యాణ్ స్వామి కదిలారు. వెనుకగా 'రాంబోలా'చుట్టూ కలయజూస్తూ అనుసరించింది.

వారు రహదారివెంట వృక్షాలమధ్య కనుమరుగైన వెంటనే తాము చూసిన ఐదు తలల తెల్ల పామును గురించి అందుకున్నారు గుడిలోనుండి పారిపోయిన సిపాయీలు. అది పడగలు విసిరితే తాము ఎంత చురుగ్గా తప్పించుకున్నదీ మరలా చెప్పడం మొదలెట్టారు. బండరాళ్ళమీద చేరగిలబడి నోళ్ళు తెరుచుకుని వినసాగారు శ్రోతలు.

(కొనసాగింపు వచ్చే సంచికలో..)

COMMENTS